# కాలమహిమ

సుబ్బారాయుడని ఒహాయన ఉన్నాడు. తాతపేరు. ఆ పేరుని చూసి పల్లెటూరి బైతనుకునేరు - అదేం కాదు. వాళ్ళ తాత, నాన్న వెంకట్రాయుడూ మట్టిపిసుక్కుని బతికినా, సుబ్బారాయుడికి ఆఖర్మ పట్టలేదు. వాళ్ళ నాన్న మహామేధావి. నూర్రూపాయల కట్ట చేతికిస్తే - బరువు చూసి - ఎంత తక్కువ ఉందో చెప్పేవాడు. ఆయన చేతికర్ర పంపితే, షావుకార్లు కళ్ళు మూసుకుని ఎంత డబ్బు కావాలంటే అంత యిచ్చేవారు. మనిషి మొహం చూసి - ఎవడెలాంటి వెధవో పట్టేసేవాడు. ఆయన చాచిపెట్టి కొడితే - మనుషులు మంచినీళ్ళడక్కుండా - టపాకట్టేసేవారు. కాలుమీద కాలేసుకుని కూర్చున్నా - తరగని ఆస్తిపరుడు. రోజులు ఒక్కలా ఉంటాయా?

- ఇంక యిక్కడనించి దున్నేవాడిదే భూమి. భూస్వాముల మెడల మీద కాడిపెట్టి దున్నిస్తాం - అంటూ కమ్యూనిస్టులు కేకలు వెయ్యటంతో నిజమేననుకుని, వెంకట్రాయుడు బాధపడిపోయాడు.

రోజులు మారిపోతున్నాయి. మనుషులు మారిపోతున్నారు. కట్టుబాట్లు తెగిపో తున్నాయి. మంచీ చెడ్డా పోయింది. భూముల్ని నమ్ముకుంటే ఉంటాయో ఊడతాయో! - అని ఆలోచన చేసాడు.

సినిమా హాళ్ళు కట్టాడు. హోటళ్ళు కట్టాడు. ఓ సినిమా తీసాడు. కొడుకుని చదువులో పెట్టాడు. కొడుకు చదువు తప్ప మరేదీ కలిసిరాలేదు. పదివేళ్ళకి పది ఉంగరాలు పెట్టుకునే ఆసామీ చివరికి కొడుకు పంచన చేరాడు. అక్కడే తనువు చాలించాడు.

సుబ్బారాయుడు మహా మంచివాడు. ఎప్పుడూ ఒకరి విషయాన్ని పట్టించుకొనేరకం కాదు. తన మానాన తను ఉండేవాడు. జనాలు ఊరుకోరుగదా-

'మీ నాన్న - అంతవాడు. యింతవాడు. అలాంటి సాయాలు చేసాడు. ఇలాంటి సాయాలు చేసాడు. కనుక నువ్వూ చెయ్యాలి - అంటూ సుబ్బారాయుడిని - ఆశ్రయించే వారు. లోకమంటే ఏమిటి? పెడితే పెళ్ళీ, పెట్టకపోతే శ్రాద్ధమూనూ! పిల్లికి బిచ్చం పెట్టడట - కాకికి ఎంగిలి చేత్తోవిదపడట - అంటారు. ఎందుకనరూ - పచ్చగా ఉంటే ప్రతీ వాడికీ ఏడుపే! ఆ రోజుల్లో అంటే పెట్టడం ఒక ఫ్యాషన్! పెట్టాదనిపించుకోడం ఓ ఫ్యాషన్! ఈ రోజుల్లో ఎవడు ఎవడికి పెట్టిపోసేస్తున్నాడు!

అంతటితో ఆగారా - లేనిపోని మాటలు. తాగుతాట్ట. పెళ్ళాన్ని రాచి రంపాన పెడతాట్ట. ఒకటే చెప్పుకోడం - అక్కడికి ఆ చెప్పుకొనే వాళ్ళంతా ఏ రకం మందు వాసనా చూడనట్టూ, పెళ్ళాన్ని పల్లెత్తు మాట అననట్టూనూ!

అసలు - రోజులెలాంటివి? పెద్ద చదువులు చదివినాడూ - పెద్ద పదవిలో ఉన్నాడు - పెద్దపెద్దవాళ్ళ స్నేహాలుంటాయి - సంపాదన రెండు చేతులా ఉంటుంది. తప్పదు గదా - అలాంటాళ్ళకు ఎంతమంది వెనకబడుతుంటారు - ఎన్నిరకాల మొహమాటాలు పెడతారు - తప్పుతుందా - తాగుతాడు. అయితే ఏం? ఎప్పుడయినా తాగి రోడ్డున పడ్డాడా? ఎవరి చేతయినా తన్నులు తిన్నాడా? సరే - ఆయన గురించి పై వాళ్ళకి తెలీదు - ఆయన కారు డ్రైవర్లకి తెలీకుండా ఉంటుందా? పెళ్ళానికి తెలీదా? - వాళ్ళు ఆ మాట ఎన్నడు గాక అనరు గాక అనరు.

ఇహపోతే పెళ్ళాం - పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. నిజమే - ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారం కాదు. అయితే - ఎంతమంది ఆ పని చేస్తున్నారు? పది రూపాయల సంపాదన లేనివాడు కూడా - తన పొట్టకి తను చూసుకుంటాడు గాని, పెళ్ళాం పిల్లలని చూసుకుంటున్నాడా? పైగా పెళ్ళాల మీద ఎన్నెన్ని అనుమానాలూ! సుబ్బారాయుడు అంటే మనిషి. అసలు సిసలైన మనిషి. బంగారాలు - చీరలు - సరే ప్రతీవాడూ కొంటాడు - ఇళ్ళస్థలాలూ, ఇతర ఆస్తులూ పెళ్ళాం పేరనే కొంటాడా? సుబ్బారాయుడు కొన్నాడు. కొంటాడు.

ఆవిడ కూడా ఉత్తమ యిల్లాలు. ఈ రోజుల్లో తప్పబుట్టిన మనిషి. ఈ రోజుల్లో ఆడవాళ్ళు ఎంతెలా పెట్రేగిపోతున్నారూ - ఆవిడ అలా చేసేదికాదు. అగ్గగ్గలాడుతూ అన్నీ అమర్చేది. కనుగలిగినట్టు చేసుకుపోయేది. ఎంతయినా ఆడమనిషి కదా - ఏదో ఒక పొరపాటు చేస్తుంది. సుబ్బారాయుడు మాంచి లెక్కల్లో మనిషి. 'ఛత్ - పొరపాటు చేస్తావా' అంటూ లేచేవాడు. ఆవిడ కూడా అంతే - ఏం చెయ్యాలి? దాసుని తప్పు దండంతో సరి - అని చేతులు జోడించవచ్చు కదా - వీపు వంచాలి గదా - అలాగెందుకు చేస్తుంది? ఆడది. మగాడి కోసం ఆడదాన్ని పుట్టించాడా దేముడు - ఆడదాని కోసం మగాడిని పుట్టిం చాడా? ఆ ప్రశ్న ఆమె వేసుకోవాలి. ఆ జ్ఞానం పెంచుకోవాలి. అప్పుడు ఆ మగాడి పేరు వీధిలో

పడదు – ఏదో సంసారమన్నాక – చిన్నా, పెద్దా ఇలాంటివి ఉంటాయి. ఆ మాత్రా నికే ఆయన పెళ్ళాన్ని రాచి రంపాన పెడతాడనటం న్యాయంకాదు.

సుబ్బారాయుడికి లక్ష్మీనారాయణ అని ఒక స్నేహితుడున్నాడు. చిన్నప్పుడు ఆయనని జాంపండు అనేవారు. సీమకి వెళ్ళి చదువుకున్నాడు. సీమదొరసాని మంచిదా – భారత కన్య మంచిదా – అని బాగా ఆలోచించి నేరేడుపండు లాంటి కన్యని పెళ్ళి చేసుకున్నాడు. సీమ ఉద్యోగం మంచిదా – ఇక్కడ కొలువు మంచిదా – అని ఆలోచించి సీమ ఉద్యోగం కుదుర్చుకున్నాడు. బాగా వెనకేయటం మంచిదా – ఊరకే తగలేయటం మంచిదా – అని ఆలోచించి బాగా వెనకేయడం మొదలుపెట్టాడు. పురుళ్ళకీ పుణ్యాలకీ అక్కడ బాగుంటుందా – ఇక్కడ బాగుంటుందా – అని ఆలోచించి. ఇక్కడే బాగుంటుందని నిశ్చయించుకున్నాడు.

అలా నిశ్చయించుకున్న లక్ష్మీనారాయణ భార్యకి మొదటి కానుపు రోజుల్లో హైదరా బాదు వచ్చాడు. పెళ్ళాన్ని నర్సింగ్ హోంలో ఉంచి; ఆవిడకి తల్లినీ, అత్తగారినీ కాపలా ఉంచి; డబ్బుల పని మామగారికీ, తండ్రికీ అప్పగించి; క్యారేజీ మొయ్యటానికి తమ్ముడినీ, బామ్మర్దినీ నియమించి; బీరు తాగటానికి సుబ్బారాయుడి యింటికి వచ్చాడు.

వస్తూనే చాలా గాభరాపడి పోయాడు లక్ష్మీనారాయణ.

"–ఏమవుతోంది మీ దేశానికి? ప్రపంచంలో ఎక్కడా కనలేదు – ఎన్నడూ వినలేదు – డెమొక్రటిక్‌గా ఎన్నుకొన్న ఇందిరాగాంధీ ఇలా మారిపోయిందేంటి?" అన్నాడు లక్ష్మీ నారాయణ.

స్నేహితుడి సీమ చిరునామా పట్టినంతగా – సుబ్బారాయుడుకి అతని గాభరాపట్టలేదు. భార్య సరైన గ్లాసులు ఎంచిందా లేదా – అవి సరిగా అమరించిందా లేదా – స్టేటస్ స్నేహితు డికి భారత గౌరవ ప్రతిష్ఠలు ప్రదర్శించిందా లేదా – అన్న పరిశీలనలో ఉన్నట్టు కనిపించ కుండా ఉన్నాడు సుబ్బారాయుడు. భార్య చూపుల్లో స్నేహితుని పట్ల ఉత్సుకత లేకపోవటం కోసమూ, స్నేహితుని చూపుల్లో భార్య పట్ల జలసీ ఉండటం కోసమూ – కూడా సుబ్బారాయుడు పరిశీలనలో ఉన్నాడు.

చివరకి భార్య అన్నీ అమర్చి, మర్యాద నవ్వులు చిందించి, అక్కడ నించి నిష్క్రమించాక, మరికొంతసేపు తన పరిశీలనా ఫలితాల విశ్లేషణలో గడిపి, అంతా సక్రమంగా అయిందని తృప్తిపడి, ఆ ఉల్లాసంలో స్నేహితుడి గ్లాసుని తన గ్లాసుతో ఢీకొట్టాడు సుబ్బారాయుడు.

"– ఇప్పుడు చెప్పు – ఏమిటి నీ గాభరా? దోరజాంపండులా ఉండేవాడివి – సీమనీళ్ళు పడి పండు జాంపండులా తయారయావు – ఏమిటి నీవేదన?" అన్నాడు సుబ్బారాయుడు.

ఓపికగా, తన గాభరా అంతా చెప్పాడు లక్ష్మీనారాయణ.

"ఎక్కడ చూసినా గరీబీ హటావో మంత్రోచ్చారణ! ఒకపక్క రాజభరణాల రద్దు! ఇంకో పక్క బ్యాంకుల జాతీయీకరణ! ఇంకేముంది సోషలిజం వచ్చేసిందని మీ దేశపు కవికాకుల

కేకలు! మీ ఫోర్త్ ఎస్టేట్ నిశ్శబ్ద నీరాజనాలు! – ఇదంతా రష్యా వాళ్ళ ఒత్తిడి కాదు గదా – అలా ఆఫ్ఘనిస్తానం మీంచి సోషలిజం ఇండియాకు గాని వచ్చేస్తోందా?"

"వస్తే వస్తుంది – నీకేం?" అన్నాడు సుబ్బారాయుడు అన్నీ తెలిసిన గొంతుతో, తనకేమీ తెలియదన్న ధోరణిలో.

'తెలిసిన వాడికి చెప్పొచ్చు – తెలియని వాడికి చెప్పొచ్చు – తెలిసీ, తెలియని వాడికి ఎలా చెప్పటం–' అన్నట్లు విచారంగా చూసి, తల ఆడించి, కళ్ళు విప్పార్చి, కాళ్ళు కదిల్చి – గ్లాసులో ఉన్నది గొంతులో పోసుకుని, ప్లేటులో ఉన్నది వాసన చూసి – మాంసమా?' అని ప్రశ్నించి, తేల్చుకుని, దాన్ని వేళ్ళతో పక్కకి తొలగంద్రోసి, ఆ వేళ్ళ మీద కాసింత బీరు రెండో చేత్తో చిలకరించి కడుక్కుని, – నేను భారతీయ సంస్కృతికి వారసుడిని' అని తెలియబరచి, జీడిపప్పుని నవిలాడు.

"నిజంగా – ఇండియాకు సోషలిజం వస్తే నీకేమీ అవదా సుబ్బారాయుడూ?" అన్నాడు.

"అవదు. నీకేమయినా అవుతుందా లక్ష్మీనారాయణా?" అన్నాడు.

"నా ఉద్యోగం పోతుంది–"

"–ఇండియాలో సోషలిజం వస్తే నీ ఉద్యోగం నీ దేశంలో ఎలా పోతుందో – ఆ కథ సరిగ్గా చెప్పు–"

"– నీకు తెలుసుగదా – నేను కెమికల్ ఇంజనీర్ని. బాటరీలు చేస్తుంటాను. బాటరీలతోనే గదా – బాంబులు పేలుస్తారు. ఆ బాంబులు అమ్ముడయితేనే గదా – మా బాటరీలు అమ్ముడవుతాయి. యుద్ధాలు ఉంటేనే గదా – బాంబులు అమ్ముడవుతాయి."

"నిజమే – నిజమే" అంటూ సుబ్బారాయుడు పుస్తకాల షెల్ఫ్ మీద కూర్చున్న బుద్ధుడి బొమ్మ మీద దుమ్ముని పెళ్ళాం ఎందుకు దులిపించలేదా అని ఆలోచిస్తున్నాడు.

"ఇప్పుడు చెప్పు సుబ్బారాయుడూ – సోషలిజం మీ దేశంలో కూడా వస్తే – అది వైరస్‌లా ప్రపంచమంతా వ్యాపించిపోదా? అప్పుడు దేశాల లోపలా, మధ్యా యుద్ధాలు పోవా? – అప్పుడు బాంబుల అమ్మకాలు పోవా–? అప్పుడు బాటరీల అమ్మకాలు పోవా?– అప్పుడు నా ఉద్యోగం పోదా?–" లక్ష్మీనారాయణ తన స్వంత గుండెని తన స్వంత చేతితో రాసుకుంటూ – ఆవేదనగా అడిగాడు.

"నాకు తెలియదు–" భారతీయ అడ్మినిస్ట్రేషన్‌కి అవసరమైనంత నాన్పుడుతనంతో జవాబిచ్చాడు సుబ్బారాయుడు.

"నీకేమాత్రం విచారంగా లేదా?"

"నాకు తెలియదు–"

"పోనీ – సోషలిజం వస్తోందని సంతోషంగా ఉందా?"

"నాకు తెలియదు–"

"నువ్వా బుద్ధుడి బొమ్మ చూస్తూ - కోరికే సర్వదుఃఖాలకూ మూలం - అన్న తాత్కాలిక భ్రాంతిలో ఉన్నట్లున్నావు - దయచేసి బయటకురా సుబ్బారాయుడూ - నా గాభరా తగ్గించు సుబ్బారాయుడూ-"

"అయితే - వస్తానుండు-" అంటూ లేచి వెళ్ళి, బుద్ధుడి దుమ్ము దులపనందుకు భార్య దుమ్ము దులిపాడు. ఆవిడ 'పనిపసిపిల్ల'కు దుమ్ము దులిపింది. ఆ పసిపనిపిల్ల ఆ పని చేస్తుండగా - శాంత మనస్కుడై - సుబ్బారాయుడు అన్నాడు.

"చూసావా లక్ష్మీ - ఆ పనిపిల్ల బుద్ధుడి దుమ్ము దులుపుతోంది. బుద్ధుడు మారతాడా? పనిపిల్ల మారుతుందా?"

"మారదు - మారదు"

"ఇందిరమ్మ దుమ్ముదులుపుతోంది. ఏమైనా మారుతుందా?"

"చెప్పలేం - మారినా, మారుతుంది."

"నిజమే - మీ అమెరికా వాళ్ళు మా దేశానికి అప్పులు ఇచ్చే వేగమూ, ఇతరుల చేత ఇప్పనిచ్చే వేగమూ మారుతుంది. పాకిస్తాన్ వాళ్ళకి ఆయుధాలు అమ్మే వేగమూ, మాకు అమ్మేవాళ్ళ మీద ఒత్తిడి పెంచే వేగమూ మారుతుంది. కానీ - మా దేశం మారదు."

"ఏమో - మారినా, మారుతుంది."

"నిజమే - మా కాంగ్రెస్‌కి వేసే ఓట్ల సంఖ్య పెరిగినా పెరుగుతుంది. పేద ప్రజానీకానికి రాజ్యం మీద గురి పెరిగినా పెరుగుతుంది - కానీ లక్ష్మీనారాయణా - మా దేశం మారదు."

"నువ్వనే మీ దేశం ఏమిటి సుబ్బారాయుడూ-" గ్లాసు నింపుకుంటూ నురగ రాకుండా జాగ్రత్త పడటం ద్వారా పదునెక్కిన బుద్ధితో అన్నాడు.

"నేను నా సెక్రటరీనే మార్చలేను - ఇంకేం మార్చగలనని, మా ఇందిరమ్మ వంటి మనిషినే వాపోయేలా చేసిన - మేమే - మేమే - మా దేశం - బ్యూరోక్రాటిక్ వ్యవస్థే మా దేశం-"

అద్వైతాన్ని వివరిస్తున్నపుడు శంకరుడు నవ్వటానికి అవకాశం ఉన్న నవ్వుని అంతకన్న బాగా నవ్వాడు సుబ్బారాయుడు.

లక్ష్మీనారాయణ విస్తుపోయి, తేరుకుని అన్నాడు -

"నిజమే - నిజమే - దేశమంటే మీరూ, రాజకీయ నాయకులూనూ! అంతేకాదు - మా దేశమంటే మేమూ, రాజకీయ నాయకులూనూ!" - అని ఒప్పేసుకున్నాడు లక్ష్మీనారాయణ.

అతనలా ఒప్పేసుకున్నాక, రాజకీయ నాయకులను కలపటాన్ని సుబ్బారాయుడు కూడా ఒప్పేసుకున్నాడు.

ఆ తర్వాత -

"పై నుంచి పోసే సోషలిజాన్ని కిందకి జారకుండా అడ్డుకునే మహత్తర శక్తి మీది -"

అని కూడా లక్ష్మీనారాయణ మెచ్చుకున్నాడు.

ఆ మెచ్చుకోలును సుబ్బారాయుడు కామెంటుగా స్వీకరించలేదు. నిర్లిప్తంగా స్వీకరించాడు.

ఇరవై ఏళ్ళ తర్వాత - అదే సుబ్బారాయుడు ఏమన్నాడు?

అవును - ఇరవై ఏళ్ళే - కాలం ఎంత మహిమాన్వితమైనది! ఎంత తొందరగా పరుగు తీస్తుంది! అలా వారిద్దరూ గడిపిన రాత్రి కాలగర్భంలో కలిసిపోయింది గదా!

ఓడలు బళ్ళు అవుతాయిట. బళ్ళు ఓడలు అవుతాయిట. అంటే కలిగినవాళ్ళు కలగని వాళ్ళు అవుతారుట. కలగని వాళ్ళు కలిగిన వాళ్ళు అవుతారుట. ఈ మాట అన్నవాళ్ళు చిన్నవాళ్ళు కాదు. ఎన్నెన్నో చూసిన అనుభవమున్న వాళ్ళే అయుండాలి. అలా ఆ రోజుల్లో ఎందుకు జరిగేదో మరి! ఏమైనా ఆ అన్నవాళ్ళు అలా అయినందుకు ఎంతో బాధపడినవాళ్ళే! కలిగినవాళ్ళు శాశ్వతంగా అలా ఉండిపోకపోవడం ఎంత దుశ్చర్య! ఎంత దుర్విధి! - అని వాపోయి, అన్నవాళ్ళే! అయితే ఆ రోజులు పోయాయి. కలిగినవాళ్ళు శాశ్వతంగా కలిగిన వాళ్ళై బ్రతకగలిగిన వాళ్ళయి రోజులు వచ్చేసాయి.

చాలాకాలం తరువాత లక్ష్మీనారాయణ మళ్ళీ భారతదేశానికి వచ్చాడు. ఈ మధ్యలో అతనికి పురుళ్ళ అవసరం రాలేదు. పుణ్యాల కోసం మధ్యలో వచ్చి తిరపతీ, షిర్డీ, పుట్టపర్తీ గట్రా చూసుకుని వెళ్ళేవాడు. అమెరికాలో కూడా పుణ్యాలకు కౌంటర్లు ముమ్మరం కావటంతో - పుణ్యం - అక్కడ కిడుతుందా, యిక్కడ కిడుతుందా - అని లెక్కలు వేసుకుని, విమానం ఖర్చులూ బంధుమిత్రుల బహుమానాల ఖర్చులూ కలుపుకుంటే అక్కడే కిడుతుందని తేల్చుకుని రావటం తగ్గించాడు. అతను భారతావని మీద కాలుమోపి పదిహేనేళ్ళయి పోయింది. భారతదేశంలో 'ఇంగ్లీషు, బూతు సినిమాల డిస్ట్రిబ్యూషన్‌లో కొంత సొమ్ముని పెట్టాడు. చేసిన పుణ్యం ఊరకనే పోతుందా - అది ఫలితం చూపెట్టింది. ఎవరో కొందరు వెర్రికుట్టి మేధావులు - ఈ బ్రిగేడ్ బీ సినిమాలు చూస్తూ బ్రతకాల్సిందేనా - అని తలలు బాదుకున్నా, లక్ష్మీనారాయణ రిలీజ్‌చేసిన సినిమాలు భారతీయసంస్కృతికి బట్టవిప్పి, అవి బ్రతికి బట్టకట్టాయి.

అటు ఉద్యోగంలో మిగుల్చుకున్నదీ, ఇటు ఇలాంటి చిల్లర మల్లర వర్తకాలలో కష్టపడి చేసుకున్నదీ చూసుకుంటూ ఏదోలా చరమ జీవితం గడిపేద్దామనుకున్నాడు లక్ష్మీనారాయణ.

మనిషి, ఒకలా తలిస్తే - దేవుడు మరోలా తలుస్తాడు గదా - అంతా బావుందనుకున్నపుడు లక్ష్మీనారాయణకి రాగూడని కష్టం వచ్చింది. అది పిల్లల సమస్య. వాళ్ళ భవిష్యత్తు సమస్య. కుర్రాడికి ఇరవై ఏళ్ళు వచ్చేయి. కుర్రదానికి పదిహేడు. కుర్రాడు - మగాడు ఎవరితోనో తిరుగుతాడు. ఏదో చేస్తాడు - అని సరిపెట్టుకుందామన్నా, ఎప్పుడు ఏ రోగం పీకకి చుట్టుకుంటుందో తెలీదు - భారతీయుడనైన నేనే తల్లికి తండ్రికీ కాలేకపోయానుగదా - వీడేం చేస్తాడో తెలీదు - అని బెంగ పెట్టుకున్నాడు. ఈడేరిన పిల్ల - ఆడపిల్ల! ఇండియాలో

ఎలా ఉండాలో - అలాగే అమెరికాలో ఉండేలా కనిపించటంలేదు - అని బెంగపెట్టు కున్నాడు.

నారు పోసిన వాడు నీరు పోస్తాడుగదా - ఇలా బెంగ పెట్టుకున్న లక్ష్మీనారాయణకి దేశమాత పిలుపు వినబడసాగింది.

"ఓ దేశభక్తులారా - మీరు రండి - మీ దేశాన్ని మరవకండి మీకు అన్నిరకాల సదుపాయాలూ చేస్తాం - మీ డబ్బు ఇక్కడ పెట్టండి. మీ లాభాలు మీరు చేసుకోండి - మాకు పన్నులూ, మా పిల్లలకు పనులూ కట్టండి - చూపెట్టండి-" అంటూ రాష్ట్రాల పెద్దలూ, దేశాల పెద్దలూ ఒకరి తర్వాత ఒకరు వెళ్ళి నచ్చజెపుతూంటే లక్ష్మీనారాయణ మళ్ళీ లెక్కల్లో పడ్డాడు.

ఆయనలో దేశభక్తి ఉప్పొంగినా, తొందరపడలేదు. కష్టార్జితాన్ని ఎలా నేలపాలు చేస్తాడు - ఆ నేల తను పుట్టినదయితే మాత్రం?

అందుకని సర్వే కోసం భారతదేశానికి వచ్చాడు.

భారతదేశం రత్నగర్భలా కనిపించింది. ఆ రత్నాలయినా మరీ లోతుగా లేవు. చెయ్యి పెడితే అందేలా ఉన్నాయి. అందులో ఏ రత్నం తీసుకోవాలి? - ఇదీ లక్ష్మీనారాయణ సమస్య.

అమెరికా మిత్రులు అన్నారూ - 'ఎరిగిన దెయ్యమే మంచిది. బాటరీలు చెయ్యి' అని.

లక్ష్మీనారాయణ ఒప్పుకోలేదు - రష్యా ముక్కలయిపోయింది. సోషలిజం కనీసం ఒక స్వప్నంగా కూడా మిగలలేదు. చాలా దేశాల్లో అది లా అండ్ ఆర్డర్ సమస్యగా మిగిలిపోయింది. అందువల్ల ఇంక యుద్ధభయం లేదు. మన బాంబులూ బాటరీలూ ఎవరు కొంటార్రా - అని నిలదీసి అడిగాడు.

'నువ్వేమీ బెంగపడకు - యుద్ధాలను ఏదోలా మానేజ్ చేస్తారులే మనవాళ్ళు-' అన్నారు. అలా ఎంత ధైర్యం చెప్పినా, లక్ష్మీనారాయణ తెగించలేదు. 'యుద్ధాల దగ్గరకు వచ్చేసరికి - లాభాల వాళ్ళంతా ఒక్కటే అవుతారు. నిజమేగానీ - లాభాల దగ్గరకు వచ్చేసరికి యుద్ధోపజీవుల మధ్య ఎన్నిరకాల ప్రచ్ఛన్న యుద్ధాలు! ఈ ప్రచ్ఛన్న యుద్ధాలలో ఎన్నిరకాల ప్రచ్ఛన్నా యుధాలు! వాటిలో అన్నింటికన్న ముఖ్యమైన 'నాణ్యత' తాలూకు ప్రాధాన్యతా, తడాఖా ఏమిటో, యుద్ధ పారిశ్రామికులలో అభివృద్ధి చెందినవాళ్ళ మోనోపలీ దానిమీద ఏమిటో - వాళ్ళు చూపించేదాకా తెలీదు. అప్పుడు తన తయారుచేసిన బ్యాటరీలు అమ్ముడవక, మీదవేసుకుని తగలేసుకోవాలి!'- అనుకున్నాడు.

మనసులో భయాలు వాళ్ళ ముందు పెట్టాడు.

అమెరికా మిత్రులు గట్టిగా నవ్వేసారు - 'ఓరి వెర్రి భారత 'ఆరిజనుడా!' సముద్రంలో కాకిరెట్టపాటి చేయని నీ బాటరీల మీదకు బ్రహ్మాస్త్రాన్ని ఎవరు సంధిస్తారు? అదలా ఉంచు

– మన ఈ బాటరీల నిర్మాణం వల్ల వచ్చే రేడియేషన్ మాట ఏమిటి? – మన రాజకీయ నాయకులకు మన ప్రజల యోగక్షేమాలు చాలా ముఖ్యమని చెప్పుకోటానికి ఇలాంటి చిట్టిపొట్టి వస్తువులను – ప్రపంచంలో కుప్పలు తెప్పలుగా పడున్న అలగా మురికి దేశాలలో – తయారు చేయించే ప్రణాళికలున్నాయి గదా – వాటి నిర్మాణం ఆ దేశాలలో చేయించి, వాడకం మనం చేసుకుందామని గదా ఆలోచన! కనక – నువ్వు బాటరీలు తయారుచెయ్యి. కావాలంటే మేం టెక్నాలజీ సరఫరా చేస్తాం – పేటెంట్ చట్టాలను నీకు అనుకూలంగా వుంచుతాం–" అన్నారు.

అయినా, లక్ష్మీనారాయణ తెగించలేదు. తను చేయగలిగిన బాటరీలు ఇండియాలో ఈ పాటికే చేసేస్తున్నారు – అనుకున్నాడు.

ఈ దేశంలో 'నాణ్యత' ఫోజు కలదీ – 'నాణ్యత' లేకున్నా, దాని సంగతి వాడకందార్లకి తెలియనదీ – ఏదీ? అని ప్రశ్న వేసుకున్నాడు. తపస్సు చేసాడు.

అప్పుడతని భక్తిని మెచ్చి బాగును కోరే దేముళ్ళంతా ముక్తకంఠంతో 'రోగ పరిశ్రమ' అన్నారు. ప్రతీ దేముడూ ఎంత కరుణామయుడు! రోగులను సృష్టిస్తున్నాడు. రోగ భయార్తులను సృష్టిస్తున్నాడు. రోగుల దగ్గర డబ్బులు ఉంచటంలేదు. రోగభయార్తుల వద్ద డబ్బులు ఉంచుతున్నాడు. మనుషులను చంపే ఆయుధాల చుట్టూ 'నాణ్యతా స్పృహ' పెంచుతున్నాడు. మనుషులను బ్రతికించే వైద్యం. వైద్యులు, వైద్య పరికరాల చుట్టూ నాణ్యతా స్పృహ తగ్గించుతున్నాడు. రోగాల పేర్లు, పరికరాల పేర్లు, వైద్యుల పేర్లు చుట్టూ మనుష్యలను బంధించుతున్నాడు. ఆహా! ఏమి భారతదేశ ప్రత్యేకత – రోగులకు వైద్యం చెయ్యక్కర్లేదు. రోగభయార్తుల నుంచి ధనమార్జించవచ్చునుగదా – అనుకున్నాడు లక్ష్మీ నారాయణ.

దానాదినా లక్ష్మీనారాయణ కూతురికి డాక్టరు పట్టా, కొడుక్కి మానేజ్‌మెంట్ పట్టా సంపాదించాలని నిశ్చయించుకున్నాడు. ఓ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రికట్టి, అప్పగించితే – కొడుకూ, కూతురూ వారి కాబోయే జీవిత భాగస్వాములూ, వారి తర్వాత ఏడేడు తరాల వారూ పొట్టపోసుకుంటారు గదా – అని నిశ్చయించుకున్నాడు.

అలా అతను తీసుకోవాల్సిన రత్నం ఏమిటో నిశ్చయమయాక, ఇంక ఆగలేదు. ఏడాదిలో మూడుసార్లు తిరిగాడు. కాంటాక్ట్స్ కుదిరాయి. ఆహా – మా చేతిలో ఒక చేప పడిందని ప్రభుత్వమూ, లక్ష్మీనారాయణా ఎవరికి వారే తృప్తిపడ్డారు.

ఉండటానికి ఓ గూడు కావాలిగదా – అందుకు నడుం బిగించాడు. జూబిలీ హిల్స్‌లో స్థలం తీసుకుని ఆరు బెడ్‌రూమ్‌లూ, వాటికి ఏ.సి. సదుపాయాలతో సహా 'గూడు' కట్టడం మొదలెట్టాడు. ఆ పక్కనే 'ఔట్‌హౌస్' వంటి ఇల్లు కడుతున్నదెవరూ అని విచారించితే, సుబ్బారాయుడు అని తేలింది. ఈ సుబ్బారాయుడు ఒకప్పటి స్నేహితుడేనని, ఉత్తర భారతంలో పదేళ్ళు సర్వీస్ చేసి, రెండేళ్ళుగా స్వంత రాష్ట్రం చేరుకున్నాడనీ తెలిసింది.

ఫోను మీద పలకరించేసరికి - ఆఫీసు కారు మీద వచ్చి, ఆప్యాయంగా కౌగిలించు కున్నాడు సుబ్బారాయుడు. అతనుంటున్న హోటలుని చూసి ఇతనూ, ఇతనుంటున్న అధికార బంగ్లా, నౌకర్లూ చాకర్లూ చూసి అతనూ కాస్త లోపల్లోపల 'అమ్మ - దొంగ ముండాకొడుకు' అనుకున్నారు.

లక్ష్మీనారాయణ బీరు తప్ప మరేం వద్దన్నాడు. నువ్వు మారలేదు - అన్నాడు సుబ్బా రాయుడు. మాంసం వద్దన్నాడు, నువ్వ మారలేదు - అన్నాడు సుబ్బారాయుడు.

"అందుకేగా - ఇక్కడకు వచ్చాను-" అన్నాడు లక్ష్మీనారాయణ పైపు వెలిగించి.

తన ఇంటి పక్క వెలుస్తున్న అల్లావుద్దీన్ అద్భుత భవనం అతనిదేనని తెలిసాక, ఆ పైపు లోంచి కంపువాసన సుబ్బారాయుడికి రాసాగింది.

"ఇప్పుడు చెప్పు లక్ష్మీనారాయణా - ఎలా ఉంది నా దేశం?"

"అదేం మాట సుబ్బారాయుడూ - ఇది నీ దేశం. దీన్ని ఉద్ధరించటం నీ పవిత్ర కర్త వ్యం - అనేసి మీ నాయకులు మాతో చెపుతూంటేనూ-"

"నిజమే-నిజమే - ఇంక ఈ దేశం నీదే - సరేగాని, పదిహేను ఏళ్ళు రాలేదన్నావు గదా - ఎలా ఉంది నీ... ఈ... దేశం!"

"ఈ దేశం మీద నా గౌరవం పెరిగిపోయింది! నిజంగా యీ.. నా.. దేశానికి ఎంత అద్భుతమైన శక్తి! కేవలం శాంతియుత మార్గంలో స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్న దేశం - నాది అదేవరవడిలో చూడు ఇప్పుడు కేపిటలిజాన్ని తెచ్చుకుంటోంది. ఎంత రక్తపాతం జరిగితే - రష్యాలో సోషలిజం పోయి - కేపిటలిజం వచ్చింది!" అన్నాడు లక్ష్మీనారాయణ.

అతని పైపు నించి మరింత కంపు సుబ్బారాయుడికి రాసాగింది.

"నిజమేగాని - లక్ష్మీనారాయణా - యీ కేపిటలిజం వద్దని ఇక్కడ చాలా రక్తం ఖర్చు పెడుతున్నారు. దీన్ని నువ్వు రక్తపాత రహితం - అని ఎలా అనగలవు? అదేదో చెప్పు-" అన్నాడు.

లక్ష్మీనారాయణ తన విదుల్చుకొని - 'బీరులో ఇక్కడ ఇంత ఆల్కహోలు ఎందుకు కలుపుతారంటావ్?' అని ప్రశ్నించి - 'ఇక్కడ తాగేవాళ్ళకి బీరూ కావాలి. కిక్కూ కావాలి. కక్కుర్తి అని తనే జవాబిచ్చి - ఆ మీదట సుబ్బారాయుడు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పాడు.

"స్వాతంత్ర్యం వద్దని తెల్లవాళ్ళు మన వాళ్ళని కొట్టలేదా - చంపలేదా? అది రక్తం కాదా? అయితే అది రక్తరహిత స్వతంత్ర పోరాటం ఎందుకు అయింది? ఎందుకయిందీ అంటే- పోయిన రక్తం భారతీయులదే ఎక్కువ అవటం వల్ల - అవునంటావా కాదంటావా?"

"నీకు బొజ్జేకాదు - బుర్రకూడా పెరిగింది."

"అంటే రాజ్యం తాలూకు రక్తం తక్కువా, జనం తాలూకు రక్తం ఎక్కువా చిందితే, అది

శాంతియుత మార్గం - రక్తరహిత విప్లవం - అదీ లాజిక్! ఇప్పుడూ అదే జరుగుతోంది - పోతే అప్పటి రాజ్యం స్వతంత్రం వద్దు అంది. ఇప్పుడదే రాజ్యం కేపిటలిజం కావాలీ అంటోంది. ఒకప్పుడు సోషలిజం క్షుద్ర మంత్రోచ్చారణతో పాపపంకిలమైన రాజ్యం - ఇలా మారిపోటం - నీకు బాగున్నట్టులేదు - నాకు మాత్రం చాలా బాగుంది సుబ్బా రాయుడూ" అన్నాడు లక్ష్మీనారాయణ.

తన గ్లాసు పక్కనబెట్టి, కళ్ళు మూసుకున్నాడు సుబ్బారాయుడు.

"ఏమయింది సుబ్బారాయుడూ?"

"ఏమీ అవలేదు-"

"నీకేం సంతోషంగా లేదూ-?"

"లేదు"

"నువ్వు చనిపోయిన సోషలిజం శవాన్ని పట్టుకు వేలాడుతున్నావా - కొంపదీసి-"

"ఛచ్ఛ -" ప్రతీ 'చ'ని ఒత్తుతూ అన్నాడు.

"అయితే విచారం ఎందుకు సుబ్బారాయుడూ - ఈ లిబరలైజేషన్ వల్ల - నీ పిల్లలకి చక్కని ఉద్యోగాలు దొరుకుతాయి. అవునంటావా కాదంటావా?"

"అవునంటాను-"

"నువ్వేమయినా పది రూపాయలు మిగుల్చుకుంటే - నాలాంటి వాళ్ళ చేతుల్లో పెడితే - కళ్ళు మూసి తెరచేలోగా అది ద్రాక్షారామ భీమేశ్వరలింగంలా పెరిగిపోటం మొదలెట్టదూ."

"అవునంటాను-"

"అయితే నీ విచారం ఏదో తమాషాగా ఉంది. అదేదో చెప్పూ-" అన్నాడు.

"ఏం చెప్పను-? ఎలా చెప్పను-? అయినా చెపుతాను లక్ష్మీ - అక్కడ నువ్వు సూర్యుని ముందు దివిటీలా బ్రతికావు. ఇక్కడ నేను సూర్యునిలా వెలిగాను. ఈ పాతిక ఏళ్ళల్లోనూ నీకూ, నాకూ ఎంత తేడా? ఈ లిబరలైజేషన్ వల్ల నీకు బత్తాయికాయ దొరికితే నాకు ఉసిరికాయ దొరుకుతుంది. నాకు బాధగా ఉండదా చెప్పు లక్ష్మీనారాయణా" అన్నాడు.

పకాలున నవ్వాడు లక్ష్మీనారాయణ.

"అదా నీ విచారం సుబ్బారాయుడూ - ఈ దేశంలో ఇన్నేళ్ళుగా ఉన్నావు గానీ, భారతీయ విచారధారను మరిచిపోయావు. నువ్వు గంగ దగ్గరకు వెళ్ళావనుకో - చెంబు పట్టుకెళితే చెంబుడుగంగ దొరుకుతుంది. బిందె తీసుకువెళ్తే బిందెడు దొరుకుతుంది. నీ పూర్వ జన్మ పుణ్యాన్ని బట్టేగదా - నీ ఈ జన్మలో లాభం! నాకన్నా కలిగిన వాళ్ళతో నేను పోల్చుకున్నాననుకో - వాళ్ళకి గుమ్మడికాయ దొరుకుతుంది - నాకు బత్తాయే దొరకుతుంది. అందుకోసం నేను విచారిస్తున్నానా? లేదుగదా - ఈ దేశంలోనే నీతిగా ఉద్యోగం చేసుకునే వాళ్లతో నిన్ను

పోల్చుకో - నీకు ఉసిరికాయ దొరికితే పాపం - వాళ్ళకి ఆవగింజే గదా దొరుకుతుంది. ఈ లిబరలైజేషన్ వల్ల" - ఆ మాటలతో సుబ్బారాయుడుకి జ్ఞానోదయం అయింది. ముక్కు రంధ్రాలు పనిచేయసాగాయి. లక్ష్మీనారాయణ పైపునించి సువాసన రాసాగింది. అతని ముందు వంగి మాట్లాడసాగాడు.

ఎవరి సాఫల్యాలను వారు చెప్పుకున్నారు. ఒకరినొకరు మెచ్చుకున్నారు. ఎవరి కష్టాలను వారు చెప్పుకున్నారు. ఒకరినొకరు ఓదార్చసాగారు.

ఆ తర్వాత లక్ష్మీనారాయణ అడిగాడు- "సుబ్బారాయుడూ - ఈ దేశమంటే నువ్వే అన్నావు ఇరవై ఏళ్ళ క్రితం. అవును నువ్వూ, మీ రాజకీయ నాయకులే మీ దేశం అని నేను ఒప్పుకున్నాను గుర్తుందా?"

"ఇప్పుడూ ఆ మాటే అంటాను."

"ఈ లిబరలైజేషన్ అనే చిన్న మొక్కను మీరు పెరగనిస్తారా?"

"ఆ అనుమానం ఎందు వచ్చిందో - అది చెప్పు లక్ష్మీనారాయణా."

"ఈ మధ్య ఒక కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఒకడు విమానంలో తగిలాడు. నువ్వు ఏ దేశస్థులను దోచుకు బ్రతకాలనుకుంటున్నావ్ - అంటూ జోక్ చేసాడు - ఇండియన్లనా? ఏమీ లాభం లేదు. ఒక ఫైల్‌ని ఒక దగ్గర నుంచి ఇంకో దగ్గరికి చేరిస్తే - కనీసం దాన్ని మనం సర్వీస్ అనొచ్చు. మనం దానికి ఖర్చుపెట్టామనుకో - పనిముందుకి జరుగుతుంది. ఇండియాలో ప్రతీ ఉద్యోగీ అడ్డంగా నిలబడతాడు. అడ్డు తప్పుకోడానికే డబ్బు అడుగుతాడు. మన సమయమంతా ఈ అడ్డు తొలగించటానికే సరిపోతుంది. ఆలోచించుకో - అని సలహా యిచ్చాడు."

సుబ్బారాయుడు తలదించుకుని వింటున్నాడు.

"ఈ చిన్ని మొక్కకు తగినన్ని నీళ్లు అందాలన్నా - దీని ఫలాలు మీ అందరికీ అందాలన్నా - ఇది విషవృక్షం కాదు కల్పతరువేనని జనం నమ్మాలన్నా -" అంటూ ఆగాడు లక్ష్మీనారాయణ.

సుబ్బారాయుడి కళ్ళు నీటిమడుగులయ్యాయి.

పై నుంచి పోస్తున్న కేపిటలిజం కిందకి జారకుండా అడ్డుకునే వికృత శక్తి మాదేనేమో - అన్ని వరాలూ సంపాదించుకుని, మా నెత్తిమీద మా చేతులే పెట్టుకునే భస్మాసురులం మేమే నేమో! -" అంటూ సుబ్బారాయుడు మరింత బాధగా తలదించుకున్నాడు.

ఆహా! ఏమి ఈ కాలమహిమ! ఇరవై ఏళ్ళలో ఒక మహత్తర శక్తి వికృత శక్తిగా మారి పోయెను!!

■

(సాహిత్య నేత్రం త్రైమాసిక - జనవరి-మే 96)